## క్లుప్తంగా

### శ్రీముత్యాలమ్మకు ప్రత్యేకాలంకరణ



**జగ్గయ్యపేట అర్బన్:** శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో రెండో ఆదివారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గసభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య, సభ్యులు చేడె శ్రీరంగం, దేవరశెట్టి నాగప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలపై సర్వే



**కంచికచర్ల(వీరులపాడు):** పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని సర్వేయర్ సాయి పేర్కొన్నారు. కంచికచర్ల పట్టణంలోని కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలకు గురైన స్థలాన్ని ఆదివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ఇరువైపులా ఆక్రమణలకు గురైందని ఫిర్యాదులు రావడంతో సర్వే నిర్వహించామన్నారు. సర్వే చేసి ప్రభుత్వ స్థలానికి మార్కింగ్ ఇచ్చామని తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి సానబోయిన సునీత వైద్యఖర్చులకుగానూ ఆదివారం దుర్గాపురంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ మధురానగర్‌కు చెందిన సానబోయిన గంగాప్రసాద్ కుమార్తె సునీత క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము తమ వంతు బాధ్యతగా స్నేహితులతో కలిసి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వీరంకి గోకర్ణేశ్వరరావు, బోడి ఆంజనేయరాజు, మహంతి వాసుదేవరావు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి జైసంతోషిమాత జయంతి ఉత్సవాలు



**పాయకాపురం(విజయవాడరూరల్):** పాయకాపురంలో వేంచేసి ఉన్న జైసంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు ఈ నెల19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 5గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల తొలిరోజు రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విశేషాలంకరణ, లక్ష్మీ గణపతి హోమం, కుంకుమ పూజ, మహానైవేద్యం, పూజ్య స్వామీజీలకు సత్కార కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు రథోత్సవం జరుగుతుందన్నారు. 21న పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. విలేఖరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీమంద్రి నాగేశ్వరరావు, ఎస్. మార్కేండేయులు, డి.గుండయ్య, చిన్ని లక్ష్మి, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

# అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి పాల పొంగళ్లు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**పెనుగంచిప్రోలు :** గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం సెలవుదినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయక్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడితోటల్లో సేదతీరారు.



ఆలయంలో భక్తుల క్యూలైన్



భక్తులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

# 450 మందికి వైద్యపరీక్షలు

**జగ్గయ్యపేట అర్బన్:** పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్(విజయవాడ)వారు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రారంభించగా, ఆయా విభాగాల డాక్టర్లంతా కలిసి మొత్తం 450మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు జగ్గయ్యపేటలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడ ఇవ్వడం పేద వారికి ఎంతో మేలు చేకూరిందన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్నటువంటి పరీక్షలను కూడా ఉచితంగా చేస్తున్న రమేష్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. వైద్యశిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ వెంకటేష్‌రెడ్డి, న్యూరాలజిస్ట్ ప్రజ్ఞ, వైద్యులు చైతన్య, సతీష్‌చంద్ర, కార్తీక్ పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, గొట్టె నాగరాజు, మాజీ కౌన్సిలర్లు కటికల అనిల్, మారేపల్లి శౌరి, బండ్ల జ్ఞానప్రకాష్, పితాని శ్రీనాథ్, రమేష్ హాస్పిటల్ మేనేజర్లు కోటేశ్వరరావు, సీతారామరెడ్డి, సిబ్బంది బి.వెంకట్, విజయ్, అమర్, దీపక్, జనార్దన్ పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు, శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

## యువత ఆధ్వర్యంలో చెత్తాచెదారం తొలగింపు

**నందిగామ టౌన్:** అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మ దిన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత-పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. యువత సభ్యులు ముందుగా పల్లగిరి రోడ్డు, విజయవాడ వైపు వెళ్లే రోడ్డు, తదితర ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వ్యర్థాలను, చెత్తాచెదారాలను తొలగించి ఆయా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో యువత సభ్యులు పోలిశెట్టి వరుణ్, కామిశెట్టి వెంకటేశ్వరరావు, పూజారి రాజేష్, ఆకుల వెంకట్, సింగంశెట్టి శ్రీనివాస్, కొంగర రామకృష్ణ, మధుసూదన్, సతీష్, శ్రీను, నరేంద్ర యోగి, వెంకట్, నాగరాజు, అరుణ, పవన్, సాయి, రాంగోపాల్, చిరంజీవి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన వ్యర్థాలను శుభ్రం చేస్తున్న చిరంజీవి యువత సభ్యులు

## అజ్మీరు శ్రీనివాసరావుకు ఘనసత్కారం

**మక్కపేట(వత్సవాయి) :** డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అజ్మీరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మక్కపేటలో ఆదివారం అజ్మీరు శ్రీనివాసరావును డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీను, మండలశాఖ అధ్యక్షుడు మోంగియానాయక్ ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న అజ్మీరు శ్రీనివాసరావు ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. అజ్మీరు శ్రీనివాసరావును అభినందించిన వారిలో డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా, రాష్ట్ర కార్యదర్శులు మర్రి ప్రభాకర్, అజ్మీరు సూరిబాబు, చిత్రాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ భానుప్రసాద్, మండల కార్యదర్శి బెల్లంకొండ పూర్ణయ్య ఉన్నారు.





అజ్మీరు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

## నేతాజీకి ఘననివాళి

**నందిగామ టౌన్:** ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ నందిగామ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం సాధించవచ్చనే సిద్ధాంతాన్ని నమ్మి అందుకనుగుణంగా పోరాడిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ అందించిన కృషి మరువలేనిదని కొనియాడారు. నేతాజీకి నివాళులర్పించినవారిలో బీజేపీ నాయకులు పులిపాటి లక్ష్మణ్, గంటా వెంకట్రావ్, మునగంటి కామేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, వీరాంజనేయులు, సత్యనారాయణ, వెంకటనారాయణ ఉన్నారు.



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీతారామయ్య, బీజేపీ నాయకులు

## వరి, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**గంపలగూడెం:** ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో అప్పటికే సాగుపూర్తి చేసిన వరి, పత్తి రైతులు పైర్లను కాపాడుకునేందుకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గంపలగూడెం మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ అన్నారు. భారీ వర్షాలకు వరి పొలాలు వరదనీటి ముంపునకు గురయ్యాయని, పత్తిచేలలో అధిక తేమశాతం ఏర్పడిందని చెప్పారు. కట్టలేరు, గుర్రపువాగు, మొగిళ్లవాగు, అనురాధ వాగు, ఊటుకూరు, కొణిజెర్ల వాగుల వెంట పరీవాహక ప్రాంతంలో కొంత విస్తీర్ణం మేర వరిపైరు మునక వేసిందన్నారు. సంబంధిత రైతులు ప్రస్తుతం వాతావరణం కొంతమేర తెరపిచ్చిన నేపథ్యంలో పొలంలో నీరు వెళ్లగొట్టాలన్నారు. అనంతరం ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌లను అదనంగా వేసుకోవాలన్నారు. అధిక వర్షంతో పత్తిచేలలో నేలలో తేమశాతం ఎక్కువ ఉండటం వలన ఎక్కడైనా మొక్కలు ఎండిపోతున్నాయా? అని పరిశీలించాలన్నారు. ఎండుతున్న చెట్ల వద్ద ఒక లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్ 1 గ్రాము కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు మొక్క అడుగుభాగం తడిసేలా పిచికారీ చేయాలని చెప్పారు. నీటిలో కరిగే 19-19-19 లేదా మల్టీకే (13-0-45) 3 గ్రాములు చొప్పున లేదా యూరియా 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు. పై పద్ధతులు పాటించడం ద్వారా వరి, పత్తి పైర్లను నష్టపోకుండా జాగ్రత్తపడాలని వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## ముగ్గురు జూదరుల అరెస్ట్

**ముసునూరు:** పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం .. గోపవరం గ్రామం నాగేంద్రపురం సెంటర్‌లోని ఓ ఇంటిలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14,400 సీజ్ చేశారు. నిందితులను సోమవారం కోర్టుకు హాజరుపరుస్తారు.


## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన





**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నరసాపూర్‌కు చెందిన ఆది పరాశక్తి నృత్య నికేతనానికి చెందిన కళా బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వి.అనంతలక్ష్మి బృందానికి చెందిన పలువురు కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

### తేజోవంతంగా బుద్ధవిగ్రహం



**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేట పట్టణంలోని ఆదివారం సాయంత్రం సూర్యాస్తమం సమయంలో స్థానిక బుద్ధవిహార్‌లోని బుద్ధుని విగ్రహం శిరస్సుపై సూర్యకిరణాలు పడిన దృశ్యం అబ్బురపరిచింది. తేజోవంతమైన వెలుగుతో ప్రకాశిస్తున్నట్లుగా కనిపిస్తున్న బుద్ధభగవానుడు చూపరులను ఆకట్టుకున్నాడు. అదే సమయంలో ధ్యానమండలి సభ్యులు బుద్ధవిహార్‌కు వచ్చిన వారు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. శ్రావణమాసం పౌర్ణమికి ముందు రోజున ఆదివారం సూర్యభగవానుడు బుద్ధభగవానుని శిరస్సుపై తేజోవంతమైన వెలుగును ప్రకాశించడాన్ని స్థానికులు ఆసక్తిగా గమనించారు.

### గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయం



**విజయవాడ కల్చరల్:** మధుర గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకుల స్ఫూర్తి కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రను తిరగరాసిన గాయకులు చాలామందే ఉన్నారని వారిలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, పీబీ శ్రీనివాస్, మాధవ పెద్దిసత్యం, భానుమతి లాంటి వారు ఎందరో ఉన్నారన్నారు. వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాపోషకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, చెట్లపల్లి మారుతి ప్రసన్న, సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు ప్రసంగించారు. గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను నిర్వాహకులు సత్కరించారు. సుశీల్ కుమార్, డేవిడ్‌రాజు, ప్రిన్స్, కుమార్ గుప్తా, అయ్యప్పన్, స్వాతి, దుర్గా నాగమణి, కామేశ్వరీలు చిత్ర గీతాలను ఆలపించారు.

### 384 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

**పెద్దకొమిర(గంపలగూడెం):** గంజాయి, మద్యం అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా తిరువూరు సెబ్ అధికారులు ఆదివారం తెల్లవారు జామున గంపలగూడెం మండలం పెద్దకొమిరలో వాహనాలు తనిఖీ చేశారు. మైలవరానికి చెందిన మోదుగు జయరామ్‌ప్రసాద్, షేక్ మాకతున్ కారులో తెలంగాణకు చెందిన 384 మద్యం సీసాలతో వెళుతుండగా పట్టుకున్నారు. మద్యం సీసాలను, కారును స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్ తెలిపారు.

### మధురంగా సాగిన వయోలిన్ కచేరీ



**విజయవాడ కల్చరల్:** సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఆదివారం అక్కరై సోదరీమణులు ఎస్. సుబ్బలక్ష్మి, ఎస్. స్వర్ణలత నిర్వహించిన వయోలిన్ కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తలను మధురంగా పలికించారు. కె.సాయి గిరిధర్ మృదంగంపై ఎం.హరిబాబు ఘటంపై వాయిద్య సహకారం అందించారు. స్వరఝరి కార్యదర్శి మాట్లాడుతూ సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు సుదీర్ఘ కాలం నగరంలోని సంగీత కళాశాలలో పనిచేశారన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా వందలాది కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అక్కరై సోదరీమణుల సంగీత సేవలను కొనియాడారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నందిగామలో రాఖీ పౌర్ణమి సందడి



నందిగామలో రాఖీ దుకాణం వద్ద రాఖీలు కొనుగోలు చేస్తున్న జనం



నందిగామ మెయిన్‌బజార్‌లో విక్రయానికి ఉంచిన బెలూన్లు

**నందిగామటౌన్:** అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీపౌర్ణమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు నందిగామ నియోజకవర్గ ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. పండుగ సందర్భంగా నందిగామ పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని రాఖీ విక్రయ కేంద్రాలు ఆదివారం వినియోగదారులతో కళకళలాడాయి. ముఖ్యంగా స్వీట్ దుకాణాలు, రాఖీ విక్రయ స్టాల్స్‌లో వినియోగదారుల తాకిడితో మెయిన్‌బజార్‌లో సందడి వాతావరణం నెలకొంది. వరుసగా సెలవులు కూడా కలిసిరావడంతో ఉద్యోగ రీత్యా స్వగ్రామాలకు దూరంగా ఉంటున్న వారంతా రాఖీ పౌర్ణమి పండుగను సోదరసోదరీమణులతో జరుపుకునేందుకు స్వస్థలాలకు తరలివస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా పండుగ వాతావరణం కనిపిస్తుంది. రాఖీ సందర్భంగా విక్రయించేందుకు ఏర్పాటు చేసిన పలురకాల రాఖీలు, బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### నెగెటివ్‌పై లూయిస్ డాగ్యురే చిత్రం

**ఈనెల 19వ తేదీ సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్ చిత్రకారుడు అల్లి సత్యనారాయణ గీచిన చిత్రం పలువురిని ఆకట్టుకుంటోంది. ఫొటోగ్రఫీలో డాగ్యురే టైప్ విధానాన్ని కనిపెట్టి ఫాదర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా ప్రసిద్ధి చెందిన లూయిస్ డాగ్యురే చిత్రాన్ని 35ఎంఎం రోల్ ఫిలిం నెగెటివ్‌పై వినూత్నంగా స్కెచ్ పెన్‌తో చిత్రించారు.**

**-జగ్గయ్యపేట అర్బన్**



## అనుమానాస్పద స్థితిలో కారుడ్రైవర్ మృతి



గిరిధర్ మృతదేహం

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** అనుమానాస్పద స్థితిలో ఓ కారుడ్రైవర్ కారులో మృతి చెందిన ఘటన నగరంలో సంచలనం రేపింది. ఈ మరణంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతిలోని సప్తగిరినగర్‌కు చెందిన ఉప్పలపాటి గిరిధర్(55) తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకు చెందిన కంచి గోపికృష్ణ అనే వ్యాపారి వద్ద కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య కొన్నేళ్ల క్రితం మృతిచెందగా కుమారుని వద్ద నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో గిరిధర్ తన యజమాని గోపికృష్ణ, అతని స్నేహితుడి తల్లిదండ్రులను పని నిమిత్తం కారులో శనివారం నగరానికి తీసుకువచ్చాడు. లబ్బీపేటలోని ఒక హోటల్ రూమ్‌లో దిగారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గోపికృష్ణ డ్రైవర్ గిరిధర్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కారు వద్దకు హోటల్ వాలెట్ కారు డ్రైవర్‌ను పంపాడు. కారు డోర్ తీసి చూడగా గిరిధర్ ముందుకు వాలిపోయి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతడిని దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి చూసి మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోపికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కొఠారి నరసింహారావుకు నివాళి

**నూజివీడు:** అసంఘటిత రంగ కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల సాధనకు సంఘాలను నిర్మించిన కార్మిక నేత కొఠారి నరసింహారావు అని వక్తలు కొనియాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు దివంగత కొఠారి నరసింహారావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం పట్టణంలోని కార్మిక భవన్‌లో నూజివీడు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి. రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర హమాలి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు తదితరులు నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కొఠారి నరసింహారావు స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని చెప్పారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కొఠారి నరసింహారావు సతీమణి రాజ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి